క్లుప్తంగా

కేశినేని భవన్‌లో ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినం



విజయవాడ స్పోర్ట్స్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దిన వేడుకలు విజయవాడ ఎంపీ కేశినేని నాని కార్యాలయం(కేశినేని భవన్)లో మంగళవారం ఘనంగా జరిగాయి. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు లింగమనేని శివరామప్రసాద్ పార్టీ జెండాను ఆవిష్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు షేక్ అమానుల్లా, ప్రముఖ వైద్యురాలు, సామాజికవేత్త నూరీ పర్వీన్, ఐ–టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు అద్దేపల్లి శివ సుందరరాజు, దళిత నాయకులు నీలం దేవ దానం, ఎక్కిరాల హనుమంతరావు, వైఎస్సార్ సీపీ నాయకులు దూది బ్రహ్మయ్య, తస్లీమా భాను, యనమద్ది నాగమల్లేశ్వరరావు, ఫయాజ్ పాల్గొన్నారు.

విరాళాల సద్వినియోగానికే నూతన కార్యాలయం



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): దాతలు ఇచ్చిన విరాళాలు సద్వినియోగం కావాలనే ఉద్దేశంతోనే నూతన కార్యాలయాన్ని ఏర్పాటు చేశామని శ్రీశైలంలోని నగరాల అన్నదానం సత్రం అధ్యక్షుడు నల్లాని సూర్యారావు అన్నారు. సాయిరాం థియేటర్ సమీపంలోని సత్రం అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయంలో మంగళవారం కమిటీ సభ్యులు మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సత్రం నిర్వహణపై కొంతమంది అసత్యాలను ప్రచారం చేస్తున్నారని, ప్రధాన కార్యదర్శి తీరు నచ్చక, దాతలు ఇచ్చిన విరాళాలు సద్వినియోగం కావాలనే భావనతోనే అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశామన్నారు. కమిటీని విడగొట్టి, కార్యాలయాన్ని ఏర్పాటు చేయించారనడం సరికాదన్నారు. సమావేశంలో కమిటీ ప్రతినిధులు తమ్మిన హేమంత్, ముదిలి మోహనరావు, పిళ్లా విజయ్‌కుమార్, జగుపిళ్ల దుర్గామహేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో అనూష ప్రతిభ



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఈ నెల 10వ తేదీన గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి చెస్ ఓపెన్ టోర్నమెంట్‌లో న్యూరాజరాజేశ్వరీపేటలోని కేర్ అండ్ షేర్ స్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థిని అవ్వారు అనూష ప్రతిభ కనబర్చింది. అండర్–15 కేటగిరీలో ఏడు రౌండ్లకు గాను నాలుగు పాయింట్లు సాధించి ట్రోఫీని, సర్టిఫికెట్‌ను సాధించింది. చెస్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థిని అనూషను పాఠశాల హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు, ఉపాధ్యాయిని ఎం.మనిబాల, చెస్ కోచ్ అవ్వారు రామకృష్ణ తదితరులు అభినందించారు. అనూష భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించి పాఠశాలకు, నగరానికి మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

చారిత్రాత్మకం.. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం

- వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జ్ ఆసిఫ్
- ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం



వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఆసిఫ్

భవానీపురం(విజయవాడపశ్చిమ): పేదల బతుకులు మెరుగుపడాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థాపించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం చారిత్రాత్మకమైనదని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ షేక్ ఆసిఫ్ అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెలకొల్పి 13 ఏళ్లు పూర్తయి 14వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా గొల్లపూడి బైపాస్ రోడ్ పక్కన ఉన్న వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పార్టీ ఆవిర్భావ దిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఆసిఫ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. పార్టీ పెట్టిన దగ్గర నుంచి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీఎం జగన్ అడుగులు వేశారని అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలలో 99 శాతం అమలు చేసి విశ్వసనీయతను చాటుకున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. గత ఎన్నికల్లో 50 శాతం ఓట్లు, 151 శాసనసభ, 22 లోక్‌సభ స్థానాల్లో విజయం సాధించి చరిత్ర సృష్టించిన పార్టీ వైఎస్సార్ సీపీ అని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన మాట కోసం ఎంత వరకైనా పోరాడే యోధుడు సీఎం జగనన్న అని అన్నారు. మహానేత వైఎస్ ఆశయ సాధనే లక్ష్యంగా రాష్ట్ర సమగ్రాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సుపరిపాలన సాగిస్తున్న సీఎం జగన్ అని అన్నారు. నైతిక విలువలతో రాజకీయాలు చేయాలన్నది వైఎస్ జగన్ సిద్ధాంతమన్నారు. దేశంలో బీసీలు ముఖ్యమంత్రులుగా ఉన్న రాష్ట్రాలలో కూడా చేయని విధంగా సామాజిక న్యాయం పాటించిన వ్యక్తి జగన్ అన్నారు.

జత కట్టిన జెండాలన్నీ కనుమరుగే

రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన జరుగుతున్న నేపథ్యంలో జత కట్టిన పార్టీల జెండాలన్నీ వచ్చే ఎన్నికల తరువాత కనుమరుగు కాక తప్పదని ఆసిఫ్ తెలిపారు. విద్య, వైద్య రంగాలలో విప్లవాత్మక సంస్కరణలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని, వారి ఆశీర్వాదంతో రానున్న ఎన్నికల్లో 2019 ఎన్నికలకు మించిన మెజారిటీతో సీఎం జగన్ నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ గెలుపు తథ్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు బండి నాగేంద్ర పుణ్యశీల, మనోజ్ కొఠారి, షేక్ గౌస్‌మొహిద్దీన్, కార్పొరేటర్లు మైలవరపు రత్నకుమారి, మండేపూడి చటర్జీ, మహదేవు అప్పాజీ, పడిగపాటి చైతన్యరెడ్డి, యరడ్ల ఆంజనేయరెడ్డి, బాపతి కోటిరెడ్డి, ఎండీ ఇర్ఫాన్, యలకల చలపతిరావు, శిరంశెట్టి పూర్ణచంద్రరావు, మరుపిళ్ల రాజేష్, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అద్భుత విజయాలను సాధించింది



వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ రాజేష్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అద్భుత విజయాలను సాధించిందని 51వ డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక దిన వేడుకలు మంగళవారం కార్పొరేటర్ రాజేష్ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ తిరిగి అత్యధిక సీట్లు సాధించటం ఖాయమన్నారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌యూఎస్‌ఏ పథకానికి డిగ్రీ కాలేజీ ఎంపిక



మైలవరం: ప్రధాన మంత్రి ఉన్నత విద్య పథకానికి మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. కళాశాలలో రవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ (ఆర్‌యూఎస్‌ఏ) పథకానికి ఎంపికైందని, ఈ పథకం కింద రాబోయే మూడు సంవత్సరాలలో కళాశాల అభివృద్ధికి రూ.5 కోట్లు కేటాయిస్తారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 19 కళాశాలలు ఎంపిక కాగా ఎన్టీఆర్ జిల్లా నుంచి మైలవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎంపిక కావడం విశేషమన్నారు. జాతీయ విద్యా విధానం–2020ని అనుసరించి ఉన్నత విద్యా సంస్థలలో విద్యార్థులకు మెరుగైన శిక్షణ, నాణ్యత ప్రమాణాలు పెంపొందించడం, శాస్త్ర సాంకేతికతను జోడించి విద్యాబోధన, ఉపాధి అవకాశాలు పెంపొందించడానికి కావలసిన ఆర్థిక సహాయాన్ని ఈ పథకం అందిస్తుందన్నారు. కళాశాల విద్యా కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ ప్రోద్బలం, సహకారంతో ఈ పథకానికి కళాశాల దరఖాస్తు చేసుకుందన్నారు. వచ్చే మూడేళ్లలో కళాశాల అభివృద్ధి చెందడానికి ఇది గొప్ప అవకాశంగా తెలిపారు.

ప్రారంభమైన రంజాన్ ఉపవాస దీక్షలు

- రోజాలో పాల్గొన్న వన్‌టౌన్ ముస్లింలు
- కళకళలాడుతున్న మసీదులు



ఇఫ్తార్ కార్యక్రమంలో ప్రార్థన చేస్తున్న ఆసిఫ్, గౌస్‌మొహిద్దీన్ తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ముస్లింల పవిత్ర మాసమైన రంజాన్ ఉపవాస దీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. రంజాన్ మాసంలో రోజా పేరుతో చేపట్టే ఉపవాస దీక్షలను ముస్లింలు సంప్రదాయబద్ధంగా మంగళవారం ప్రారంభించారు. తెల్లవారుజామున ప్రత్యేక ప్రార్థనలతో రంజాన్ మాసానికి స్వాగతం పలికారు. మంగళవారం ఉదయం సహర్ స్వీకరించి రోజాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ముస్లింలు రంజాన్ మాసంలో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలకు అవసరమైన సామగ్రి కొనుగోలు చేస్తూ బిజీబిజీగా కనిపించారు.

మసీదుల్లో ప్రత్యేక ఏర్పాట్లు

రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని నగరంలోని అన్ని మసీదు ప్రాంగణాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వన్‌టౌన్‌లోని సరాయి మసీదు, జుమ్మా మసీదు, వించిపేటలోని షాహీ మసీదుతో పాటు ఇస్లాంపేట బీఆర్పీ రోడ్డులోని మసీదులు, తారాపేటలోని మసీదుల్లో నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. కాళేశ్వరరావు మార్కెట్ సమీపంలోని సరాయి మసీదులో రంజాన్ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇందాద్‌ఘర్ నిర్వాహకులు తెలిపారు. ప్రత్యేక నమాజ్‌లతో పాటుగా ఇఫ్తార్ విందు స్వీకరించేందుకు అనువుగా ఆయా ప్రాంగణాల్లో అదనపు వసతులను ఏర్పాటు చేశారు.

రద్దీగా దర్శనమిచ్చిన మసీదు ప్రాంగణాలు

రంజాన్ తొలి రోజు కావడంతో మంగళవారం సాయంత్రం రోజా దీక్షలను ముగించేందుకు ముస్లింలు పెద్ద సంఖ్యలో ఆయా ప్రాంతాల్లోని మసీదులకు చేరుకున్నారు. సాయంత్రం ప్రత్యేక నమాజ్‌ల్లో పాల్గొని ఉపవాసదీక్షలను విరమించారు. అక్కడే ఇఫ్తార్ విందుల్లో పాల్గొన్నారు. అందరూ సామూహిక ఇఫ్తార్‌లో పాల్గొని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయా మసీదు ప్రాంగణాలన్నీ రద్దీగా దర్శనమిచ్చాయి.

విద్యుద్దీపాలతో కళకళలాడుతున్న మసీదులు

నగరంలోని ఆయా ప్రాంతాల్లోని మసీదులన్నీ మంగళవారం విద్యుద్దీపాలతో కళకళలాడాయి. పలు ప్రాంతాల్లో ఇస్లాం సూక్తులను వివరించే పలు నమూనాలను కూడా ప్రత్యేక విద్యుద్దీపాలతో అలంకరించి ఏర్పాటు చేశారు. వీటితో వించిపేట, ఇస్లాంపేట, తారాపేట ప్రాంతాల్లో ఆధ్యాత్మిక శోభ దర్శనమిస్తోంది.

ధార్మిక చింతన, క్రమశిక్షణకు ప్రతీక రంజాన్

వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జ్ ఆసిఫ్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ధార్మిక చింతన, క్రమశిక్షణకు ప్రతీకగా రంజాన్ మాసం నిలుస్తుందని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ షేక్ ఆసిఫ్ అన్నారు. పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైన సందర్భంగా విద్యాధరపురం లేబర్ కాలనీలో గల మదీనా మసీదు ఆవరణలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన ఇఫ్తార్ కార్యక్రమంలో ఆయన స్థానిక ముస్లిం మైనార్టీ సోదరులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ ఇస్లాంలో రంజాన్ మాసానికి ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. రంజాన్ మాసంలోనే పవిత్ర గ్రంథం ఖురాన్ ఉద్భవించిందని తెలిపారు. సమాజంలోని పేద, ధనిక వర్గాల మధ్య అంతరం లేకుండా అందరూ సమానమేనని రంజాన్ పండుగ వివరిస్తుందన్నారు. రంజాన్ మాసంలో చేసే ప్రతి కార్యక్రమం అల్లాహ్ కృపకు కారణమవుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డ్ అధ్యక్షుడు షేక్ గౌస్‌మొహిద్దీన్, వైఎస్సార్ సీపీ నాయకులు మైలవరపు దుర్గారావు, బాజీ బాబా, రిజ్వాన్, రహమత్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన మహిళకు తోపుడు బండి అందజేత



తోపుడు బండి అందజేస్తున్న ఆసిఫ్, మేయర్ భాగ్యలక్ష్మి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బడుగు బలహీన వర్గాలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. 46వ డివిజన్ సాయిరాం థియేటర్ ప్రాంతానికి చెందిన కట్టా లక్ష్మికి వైఎస్సార్ సీపీ నేతలు మంగళవారం తోపుడు బండిని అందజేశారు. పూల వ్యాపారం చేసుకుని జీవనం సాగించే లక్ష్మి తోపుడు బండి దెబ్బతినడంతో పార్టీ నేతలను సాయం కోరింది. వైఎస్సార్ సీపీ నాయకులు రాయన నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో మహిళకు సాయం అందించారు. గిరిజన మహిళకు సాయం అందించడంపై నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ కోశాధికారి తోకల వీరోజి వైఎస్సార్ సీపీ నేతలకు కృతజ్ఞతలు తెలిపారు.

పిల్లలతో పాటు మొక్కలను ప్రేమతో పలకరించాలి

ఘనంగా ఎస్‌ఎన్‌జీ వార్షికోత్సవం



బరంపార్క్‌లో మొక్క నాటుతున్న శారదావాణి, ఫౌండేషన్ సభ్యులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): కుటుంబంలోని పిల్లలతో పాటు ఇంటి ఆవరణలో పెంచుకుంటున్న మొక్కలను కూడా ప్రేమతో పలకరించాలని, తద్వారా పిల్లల్లానే మొక్కలు కూడా చక్కగా ఎదిగి సమాజానికి ఎంతో ఉపయోగపడతాయని పలువురు వక్తలు అన్నారు. సేవ్ ద నేచర్ బై గ్రోయింగ్ ట్రీస్ (ఎస్‌ఎన్‌జీ) ఫౌండేషన్ ఐదవ వార్షికోత్సవం మంగళవారం భవానీపురంలోని హరిత బరం పార్క్‌లో గల ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకురాలు కందుల శారదావాణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి పర్యావరణాన్ని, ప్రకృతిని కాపాడాలనే సంకల్పంతో ముందడుగు వేయాలని కోరారు. పుట్టిన రోజైనా, పెళ్లి రోజైనా ఒక మొక్క నాటి అందరికీ ఆక్సిజన్ పంచాలని విజ్ఞప్తి చేశారు. విజయవాడ మాజీ మేయర్ డాక్టర్ జంధ్యాల శంకర్ మాట్లాడుతూ ప్రకృతి ప్రేమికురాలు శారదావాణి గత ఐదేళ్లుగా లక్షలాది మొక్కలను తమ ఫౌండేషన్ సభ్యుల ద్వారా వివిధ ప్రాంతాలలో నాటించి పర్యావరణాన్ని పరిరక్షించటం అభినందనీయమన్నారు. ఆంధ్రా హాస్పిటల్ వైద్యుడు డాక్టర్ అచ్యుతరావు మాట్లాడుతూ ప్రతి ప్రాణికి స్వచ్ఛమైన గాలి ఎంతో అవసరమని, అందుకు కావల్సిన మొక్కలను నాటడాన్ని ఒక ఉద్యమంలా చేపట్టిన శారదావాణి అభినందనీయురాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎన్‌జీ ఫౌండేషన్ సభ్యులు పలువురు పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్ కృష్ణలంక రిటైనింగ్ వాల్ సందర్శించాలి

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్

గుణదల(విజయవాడ తూర్పు): తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఒక్కసారి విజయవాడ వచ్చి కృష్ణలంక రిటైనింగ్ వాల్‌ను సందర్శించాలని ఎమ్మెల్యే, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వెల్లంపల్లి శ్రీనివాసరావు అన్నారు. జగనన్న రావాలి–శ్రీనన్న కావాలి కార్యక్రమంలో భాగంగా సెంట్రల్ నియోజకవర్గంలోని ఒకటో డివిజన్‌లో కార్పొరేటర్ ఉద్దండి సునీతతో కలిసి మంగళవారం ఆయన పర్యటించారు. డివిజన్‌లోని మురళీనగర్‌లో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ కృష్ణలంక రిటైనింగ్ వాల్, రివర్ ఫ్రంట్ పార్క్‌ను ప్రారంభించింది, కట్టింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని అన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు చేయలేని అభివృద్ధిని విజయవాడలో సీఎం జగన్ చేసి చూపించాడని తెలిపారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఇళ్ల పట్టాలను రిజిస్ట్రేషన్ చేసిన ఘనత కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. బెంజి సర్కిల్ ఫ్లై ఓవర్ నిర్మాణం మొదలుపెట్టి, పూర్తిచేసింది కూడా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే నన్న సంగతి గ్రహించాలన్నారు. నగరంలో ఇన్ని మంచి కార్యక్రమాలు చేసిన జగనన్న పై బురద చల్లడం సబబు కాదన్నారు. విజయవాడలో మూడు నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ గెలవబోతోందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శైలజా రెడ్డి, ఎమ్మెల్సీ రుహుల్లా, కార్పొరేటర్లు, డివిజన్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంటి నుంచి బయటకు వెళ్లిన తన భర్త కనిపించడం లేదంటూ వివాహిత కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఫ్లోర్‌మెన్ బంగ్లా రైల్వే కార్టర్స్‌లో అల్లాడ భానుమతి, భానుచందర్ దంపతులు నివాసం ఉంటారు. భానుచందర్ రైల్వేలో హెల్పర్‌గా ఉద్యోగం చేస్తుంటాడు. ఈ నెల 11వ తేదీ సాయంత్రం బయటకు వెళ్లిన భానుచందర్ సాయంత్రం అయినా తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

డ్యాన్స్‌మాస్టర్ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

పాయకాపురం(విజయవాడరూరల్): డ్యాన్స్‌మాస్టర్ గుంట్ల కృష్ణ(41) మృతిని నున్న పోలీసులు అనుమానాస్పద మృతిగా మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అయోధ్య నగర్‌కు చెందిన గుంట్ల కృష్ణకు 15 సంవత్సరాల క్రితం వివాహం అయింది. విభేదాల కారణంగా భార్యతో విడిపోయి తల్లి వద్ద అయోధ్యనగర్‌లో ఉంటున్నాడు. ఈ నెల 10వ తేదీన రాజీవ్‌నగర్‌లో స్కూల్ వద్ద డ్యాన్స్ ప్రోగ్రామ్‌కు వచ్చిన గుంట్ల కృష్ణ ఇంటికి తిరిగి వెళ్లలేదు. సోమవారం కుటుంబ సభ్యులు స్కూల్ వద్దకు వచ్చి విచారిస్తుండగా, వారికి పాతపాడు రోడ్డులో వైన్‌షాపు దగ్గర్లో ఉన్న ఫర్నిచర్ షాపు వెనుక వెంచర్‌లో గుంట్ల కృష్ణ చనిపోయి ఉన్నట్లు తెలిసి వెళ్లి గుర్తించారు. మృతుని అన్న గుంట్ల రాము ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లోకకల్యాణార్థం బుధవ్రతం

మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీ శివజ్ఞాన పీఠం ఆధ్వర్యాన బుధవారం సీతారాంపురం చాపరాల వారి వీధిలో లోక కల్యాణార్థం శ్రీ బుధ వ్రతం నిర్వహించనున్నట్లు పీఠం ఆర్గనైజర్ పేర్ల శ్యాంప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రకటన

[illegible]

[illegible] సెల్ నెం. 9801021144

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

విజయవాడ వెస్ట్ : 90102 10386

Office mail : sakshiads@gmail.com

అభివృద్ధి దిశగా పరుగులు

- 45వ డివిజన్ వ్యాప్తంగా మౌలిక వసతులు
- ప్రజల ఆరోగ్యానికి భరోసాగా వైఎస్సార్ ఆరోగ్య కేంద్రం
- కోట్లాది రూపాయలతో రోడ్ల నిర్మాణం



45వ డివిజన్‌లోని వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం



కబేళా వద్ద ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల

భవానీపురం(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గం గట్టు వెనుక ప్రాంతంలోని 45వ డివిజన్ అభివృద్ధి దిశగా పరుగులు పెడుతోంది. డివిజన్‌లో ఎక్కువ భాగం కొండ ప్రాంతం ఉండటంతో అక్కడ అభివృద్ధి గురించి గత ప్రభుత్వ పాలకులు పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో కొండ ప్రాంతవాసుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతూ అప్పటి టీడీపీ పాలకులకు చెప్పినా ఫలితం లేక నిరాశ నిస్పృహలతో కాలం గడిపారు. ఈ నేపథ్యంలో 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి అంటే ఏమిటో డివిజన్ ప్రజలకు కళ్లకు కట్టినట్లు కనబడింది. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు సహకారంతో 45వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య కొండ ప్రాంతంలో ధ్వంసమైన మెట్లు, సైడు కాలువల నిర్మాణంతో పాటు వీధి లైట్లు కూడా ఏర్పాటు చేసి స్థానికులకు అవసరమైన మౌలిక వసతులను కల్పించారు. అదే విధంగా భారీ వర్షాలకు కూలిపోయిన రిటైనింగ్ వాల్స్‌ను నిర్మించి కొండ ప్రాంతవాసుల ఇబ్బందులను తొలగించారు. కార్పొరేటర్ మాధురి లావణ్య కొండ పైభాగంలో చివరి వరకు వెళ్లి స్థానికులు అవసరాలను తెలుసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి అక్కడి సమస్యలను పరిష్కరించడంలో సఫలీకృతులయ్యారు. ప్రభుత్వం పక్షాన ఆమె గిరివాసుల ప్రశంసలు పొందారు.

ప్రజల చెంతకే వైద్య సేవలు

గత ప్రభుత్వ పాలనలో వైద్యం పేదలకు అందని ద్రాక్షగా మిగిలిపోయింది. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజారోగ్యానికి పెద్ద పీట వేసింది. నగరంలో పేదలు నివసించే ప్రాంతాల్లో వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు(యూపీహెచ్‌సీ) ఏర్పాటు చేసిన క్రమంలో 45వ డివిజన్‌లోనూ రూ.80 లక్షలతో నిర్మించింది. స్థానిక కబేళా రోడ్‌లోని జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం గృహ సముదాయం వెనుక యూపీహెచ్‌సీ నిర్మించారు. యూపీహెచ్‌సీలో వివిధ విభాగాల్లో నిపుణులైన వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, 10 పడకలు, ల్యాబ్, ఫార్మసీ, పేషెంట్లకు వెయిటింగ్ హాల్ తదితర ఆధునాతన సౌకర్యాలతో కార్పొరేట్ వైద్య సేవలను అందించడం ద్వారా ప్రజల చెంతకే వైద్య సేవలు అన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరింది. పశ్చిమ నియోజకవర్గంలో నిర్మించిన నాలుగు వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాలు ఒకే మాదిరిగా తీర్చిదిద్దటం సమానవత్వానికి ప్రతీకలుగా నిలిచాయి. ముఖ్యంగా సీఎం జగనన్న ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో పేదల ఇంటికే వైద్యులు వెళ్లి సేవలు అందించటం దేశంలో మరెక్కడా లేకపోవడం గమనార్హం.

మోడల్ డివిజన్‌గా తీర్చిదిద్దుతున్నాం



సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రజల వద్దకే పాలన తీసుకువచ్చిన ముఖ్యమంత్రి జగనన్న ఇప్పుడు వైద్య సేవలను కూడా ప్రజల చెంతకే తీసుకురావడం హర్షణీయం. గతంలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.5లక్షల వరకు వైద్య సేవలు పొందేవారికి ఇప్పుడు రూ.25 లక్షలకు పెంచిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుంది. డివిజన్‌లోని రోటరీ నగర్‌లో రూ.60లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం జరుగుతుంది. కబేళా వద్ద ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాల(ఉర్దూ) మా డివిజన్‌లోనే ఉండటం అదృష్టంగా భావిస్తున్నాం. కోట్లాది రూపాయలతో సీసీ రోడ్లు నిర్మించాం. అన్ని విధాల అభివృద్ధి చేసి మోడల్ డివిజన్‌గా తీర్చిదిద్దుతున్నాం.

– మైలవరపు మాధురి లావణ్య, 45వ డివిజన్ కార్పొరేటర్